క్లుప్తంగా

వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, ఉచిత శిక్షణ తరగతులను రుద్రంపూర్‌లోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో శుక్రవారం సేవా అధ్యక్షురాలు జి.మధురవాణి షాలేంరాజు ప్రారంభించారు. మాట్లాడుతూ... సింగరేణి సంస్థ సేవా సమితి ద్వారా అందిస్తున్న వృత్తి శిక్షణ తరగతులను మహిళలు, గృహిణులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలన్నారు.

వైద్యశిబిరం

టేకులపల్లి: మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులంలో సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కందుల దినేష్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. పిల్లలను పరీక్షించి అవసరమైన వారికి రక్త పరీక్షలు చేసి చికిత్స అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవీందర్, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, సిబ్బంది పాల్గొన్నారు.

డైరీల పంపిణీ



డైరీలు అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్, బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ మెంబర్ పల్లి విష్ణువర్ధన్ రెడ్డి శుక్రవారం కొత్తగూడెం జిల్లా కోర్టులోని న్యాయవాదులకు నూతన సంవత్సర డైరీలను పంపిణీ చేశారు. లక్కినేని సత్యనారాయణ,తోట మల్లేశ్వర రావు, రవిచంద్ర, సాధిక్‌పాషా పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

కొత్తగూడెంఅర్బన్: క్రిస్మస్ సందర్భంగా రక్ష స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పులిరాబర్ట్ రామస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం బాబుక్యాంప్‌లోని వృద్ధులు, వితంతువులు, బాబూక్యాంపు పంచాయతీ వర్కర్లకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. 2005 సంవత్సరం నుంచి 193 అనాథ శవాలను ఖననం చేయడంతో పాటుగా అంధులకు, అభాగ్యులకు అండగా నిలుస్తూ పలు కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రవి, లక్ష్మి, విజయ్, కృష్ణ, శారద తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జేఏసీ ఏర్పాటు

ఇల్లెందురూరల్: విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా వీఓఏల జేఏసీ ఏర్పాటైందని రాష్ట్ర జేఏసీ సభ్యుడు పవన్ అన్నారు. శుక్రవారం ఇల్లెందులో ఏర్పాటైన సమావేశంలో మండల స్థాయి జేఏసీని ఎన్నుకున్నారు. పవన్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె చేపట్టామని గుర్తుచేశారు. ఆ రోజున అప్పటి ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలు దీక్షా శిబిరాల వద్ద పలు హామీలు ఇచ్చినట్లు చెప్పారు. హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే లక్ష్యంగా ఏర్పాటైన జేఏసీ డిమాండ్లను సాధించే వరకు ఉద్యమిస్తుందన్నారు. సమావేశంలో లత, ప్రమీల, విజయలక్ష్మి, సుమలత, సునీత, బాబూరావు, మోతీలాల్ పాల్గొన్నారు.

జేకే ఓసీలో పర్యటన

ఇల్లెందు: సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ (పీపీ) జి.వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం ఇల్లెందు జేకే ఓసీలో పర్యటించారు. ఓసీ పని ప్రదేశాన్ని సందర్శించారు. రోజు వారీ బొగ్గు ఉత్పత్తి రవాణా, ఓబీ బ్లాస్టింగ్ లోడింగ్ పనులను జీఎం కృష్ణయ్యను అడిగి తెలుసుకున్నారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాలను అధిగమించాలని కోరారు. రవాణాకు ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలని కోరారు. వార్షిక లక్ష్యాలను అధిగవించాలన్నారు. డైరెక్టర్ వెంట ఎస్‌ఓటూజీఎం బొల్లం వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు ఆఫీసర్ కృష్ణమోహన్, మేనేజర్ పూర్ణచందర్ ఉన్నారు.

ఉచిత ఆన్‌లైన్ సేవలు

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఇందిరమ్మ మహిళా శక్తి పథకంలో మైనార్టీ మహిళలకు ఉచితంగా ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేయనుండగా ఉచితంగా ఆన్‌లైన్ చేస్తున్నట్లు మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా తెలిపారు. కొత్తగూడెంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పాత డిపో ఏరియాలోని తమ కార్యాలయంలో ఈనెల 31వరకు ఉచితంగా ఆన్‌లైన్ చేస్తామని పేర్కొన్నారు.

తాగునీటి కొరత

సింగరేణి(కొత్తగూడెం): రామవరం ప్రాంతంలోని నేతాజీ గడ్డ, వనందాస్ బస్తీ, నాగయ్య గడ్డ, పంజాబ్ గడ్డ, 7 నంబర్ బజార్‌లో వారం రోజులుగా తాగునీరు రావటం లేదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు పట్టించుకోవడం లేదని, ఫిల్టర్ బెడ్‌లో పంపులు రిపేరు వస్తే, ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరారు.

అనుమతుల్లేని ఆకాశహర్మ్యాలు

- యథేచ్ఛగా అంతస్తుల నిర్మాణాలు
- చింతల చెరువు చుట్టూ 26 ఆక్రమణల గుర్తింపు
- యజమానులకు నోటీసుల జారీకి రంగం సిద్ధం..


ఆక్రమణకు గురైన చింతల చెరువు

చుంచుపల్లి: పంచాయతీ అధికారులు నోటీసులతో ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నా.. విద్యానగర్, హౌసింగ్‌బోర్డు ప్రాంతాలకు చెందిన బహుళ అంతస్తుల యజమానులు పట్టించుకోవడం లేదు. అక్రమ సెల్లార్లు, రోడ్ల మీదకు ర్యాంపులు, భారీ లిఫ్టుల నిర్మాణాలను చేపడుతూ రహదారిపైకి చొచ్చుకొస్తున్నా పట్టించుకునే వారే లేరు. ఏళ్లుగా ఏజెన్సీ నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ బహుళ అంతస్తుల కట్టడాలు వెలుస్తున్నాయి. విద్యానగర్‌లో ఏళ్లుగా కబ్జాకు గురవుతున్న చింతల చెరువు చుట్టూ హైడ్రా నిబంధనలకు విరుద్ధంగా 26 ఆక్రమణలు ఉన్నట్లు ఇటీవల సంబంధితశాఖ అధికారులు సర్వే ద్వారా గుర్తించారు. ఆ జాబితాలో ఇప్పటికే పూర్తయినవి కొన్ని ఉండగా, మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి. ఈ భవన యజమానులకు ప్రభుత్వ తదుపరి ఆదేశాల మేరకు నోటీసులు ఇచ్చేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ ప్రాంతాల్లో అధికారుల నిర్లక్ష్యంతో ప్రతీ ఏడాది పదుల సంఖ్యలో బహుళ అంతస్తుల భవనాలు, విలాసవంతమైన గృహాలు వెలుస్తున్నాయి. జిల్లా కేంద్రం కొత్తగూడెం చుట్టుపక్కల పలు ప్రాంతాల్లో ఇటీవల కాలంలో భారీగా అపార్టుమెంట్లు నిర్మిస్తున్నారు.

నిబంధనలకు నీళ్లు...

విద్యానగర్, హౌసింగ్ బోర్డు ఏరియాల్లో కొంత కాలంగా అక్రమ కట్టడాలు జోరుగా సాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా సెట్‌బ్యాక్‌లు మొదలుకొని సెల్లార్‌లు, లిఫ్టులు, అనుమతి లేని బహుళ అంతస్తులు కళ్ల ముందే నిర్మిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. పంచాయతీల నుంచి తీసుకున్న అనుమతులకు యజమానులు చేపట్టే అంతస్తులకు ఎలాంటి పొంతన ఉండటం లేదు. గ్రామ పంచాయతీ అధికారులు అన్ని అనుమతులతో భవన నిర్మాణాలను చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఇలాంటి అనుమతుల కోసం వచ్చే ఇంటి యజమానులకు ముందుగానే కొందరు అక్రమ మార్గాలు చూపిస్తున్నట్లు విమర్శలున్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో నిబంధనల ప్రకారం జీ ప్లస్ టూ వరకు భవనాలను నిర్మించుకునే వీలుంది. కొత్త భవన నిర్మాణానికి పంచాయతీ అనుమతి తప్పని సరిగా ఇంటి ప్లాన్‌తో పంచాయతీ అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలి.

ఆ తరువాత దానికి పంచాయతీ పాలక మండలి ఆమోదంతో అనుమతులు పొందుతారు. కానీ ఈ ప్రక్రియ గ్రామ పంచాయతీల పరిధిలో ఎక్కడా అమలవుతున్న దాఖలాల్లేవు. ముందుగానే పంచాయతీ అధికారులతో ఇంటి యజమానులు సంప్రదింపులు జరిపి పాలకవర్గం ఆమోదం లేకుండానే అనుమతులు పొందటం, ఆ తరువాత పంచాయతీ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించటంతో ఈ అడ్డగోలు బహుళ అంతస్తులు పుట్టుకొస్తున్నాయి. గడిచిన రెండేళ్ల కాలంలో చుంచుపల్లి విద్యానగర్ కాలనీలో 75 వరకు అనుమతి లేని భవనాలకు అధికారులు నోటీసులు జారీ చేశారు. జిల్లాలోనే అత్యధికంగా అనుమతుల్లేని నిర్మాణాలు విద్యానగర్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు.


విద్యానగర్‌లో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనం

చర్యలు తీసుకుంటాం...



విద్యానగర్ కాలనీ పంచాయతీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న భవనాలను గుర్తించాం. అనుమతులు లేనివాటికి గతంలోనే పలువురు కార్యదర్శులు పలుమార్లు నోటీసులు ఇచ్చారు. అయినా యజమానులు స్పందించడం లేదు. రెండు, మూడు రోజుల్లో మరోసారి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటాం.

– ఆర్.శ్రీనివాసరెడ్డి, ఈఓ, విద్యానగర్‌కాలనీ

ప్రయాణికులకు అసౌకర్యం కలగొద్దు..


ఆర్టీసీ ఆస్పత్రి భవనం పనులను పరిశీలిస్తున్న ఆర్‌ఎం సరిరామ్

చుంచుపల్లి: ఆర్టీసీని ఆదరిస్తున్న ప్రయాణికుల విషయంలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు చేపట్టాలని ఖమ్మం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎ.సరిరామ్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెం బస్టాండ్, డిపో ప్రాంగణాలను ఆయన పరిశీలించారు. మాట్లాడుతూ.. బస్టాండ్ ఆవరణలో పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. త్వరలోనే ఆర్టీసీ సిబ్బందికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయాలని డీఎంకు సూచించారు. బస్టాండ్ ప్రాంగణంలో ప్రైవేటు వాహనాలకు అనుమతి ఇవ్వకూడదని ఆదేశించారు. సిబ్బంది డిపోల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్, వైఎస్‌రావు తదితరులు ఉన్నారు.

రేపు జీపీ వర్కర్ల సమావేశం


పెట్రాంచెలకలో ప్రచారం చేస్తున్న నాయకులు

టేకులపల్లి: 22న టేకులపల్లిలో జరగనున్న తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల నిర్మాణ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా నాయకులు కత్తుల ఎర్రయ్య, పెనక సంపత్, మాడే వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం సభను జయప్రదం చేయాలని కోరుతూ.. మండలంలోని కుంటల, బద్దుతండా, పెట్రాంచెలక, ఎర్రాయిగూడెం, బోడు, కొప్పురాయి తదితర గ్రామ పంచాయతీలలో కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ టేకులపల్లి నిర్మాణ జనరల్ బాడీని నిర్వహించుకుంటోందని మండలంలోని గ్రామపంచాయతీ వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భద్రయ్య, శ్రీను, గణేష్ తదితరులు పాల్గొన్నారు .

అవగాహన ఉండాలి

టేకులపల్లి: క్యాన్సర్ మహమ్మారిపై అందరూ పూర్తిస్థాయిలో అవగాహన ఉంటేనే దానిని మన దరిచేరకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చని బోడు ఎస్‌ఐ పొడిశెట్టి శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక హృదయం స్వచ్ఛంధ సంస్థ వ్యవస్థాపకుడు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో బోడు పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐకి ఔషధ గుణాలు కిగిన బెటర్‌లీఫ్ మొక్కను అందజేశారు. ఆ తరువాత మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. క్యాన్సర్, షుగర్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ప్రజలకు ఔషధ మొక్కలు పంపిణీ చేస్తుండటం అభినందనీయమని ఒక హృదయం సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు.

ప్రభుత్వ పాఠశాలలో తిథి భోజనం


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం హెచ్‌ఎం డాక్టర్ ప్రభుదయాళ్ తిథి భోజనం ఏర్పాటు చేశారు. డీఈఓ వెంకటేశ్వరచారి, పాఠశాలలోని బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు సహపంక్తి భోజనం చేశారు.

చేతక్ షోరూం ప్రారంభం

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో సాయి అంజన మోటార్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బజాజ్ చేతక్ షోరూమ్‌ను శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ ప్రారంభించారు. షోరూమ్ అధినేత ఆకుల శ్రీనివాస్, కంపెనీ ఏఎస్‌ఎం ప్రవీణ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

టేకులపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మండల విద్యాధికారి అజ్మీరా జగన్ నాయక్ శుక్రవారం పరిశీలించారు. నాణ్యమైన భోజనం వడ్డిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

క్రీడా ప్రాంగణాన్ని కాపాడండి..

పాల్వంచరూరల్: సూరారం శివారులో క్రీడాప్రాంగణాన్ని కబ్జా చేస్తున్నారని అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్ల క్రితం క్రీడామైదానాన్ని ఆక్రమణకు ప్రయత్నించగా అడ్డుకుని హద్దులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అటవీ అధికారులు ట్రంచ్ కూడా కొట్టారు. ఇటీవలమళ్లీ ఆక్రమించుకుంటున్నారని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉద్యోగుల మృతికి నివాళి

పాల్వంచ: ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన సమగ్ర శిక్షా ఉద్యోగులకు సంఘం నాయకులు నివాళులర్పించారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యాకయ్య, గుండెపోటుతో మృతి చెందిన హైమావతిలకు నివాళులర్పించారు. మోహన్, చందు, తులసీ, జయబాబు పాల్గొన్నారు.

రేపు ఉచిత చక్రసిద్ధ్ వైద్యశిబిరం

జూలూరుపాడు: ఈనెల 22న గుండెపుడిలో డాక్టర్ సత్య సింధుజ సిద్ధ స్కాలర్ నేతృత్వంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జేకే ఆర్ట్స్ నిర్వాహకుడు కాళ్లూరు జగదీష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి ఆపరేషన్, మందులు లేకుండా చక్రసిద్ధ్‌లో చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. స్పైనల్, బ్యాక్ పెయిన్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, జాయింట్ పెయిన్స్, సయాటికా సమస్యలకు చక్రసిద్ధ్ చికిత్స చేయనున్నట్లు పేర్కొన్నారు. చికిత్సకు వచ్చేవాళ్లు ముందుగా పేర్ల నమోదుకు 8247261300, 8125910980 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఫ్యామిలీ ధృవీకరణ పత్రం జారీలో జాప్యం

పాల్వంచరూరల్: ఫ్యామిలీ ధృవీకరణ పత్రం జారీ చేసేందుకు రెవెన్యూ అధికారులు జాప్యం చేస్తున్నారని బాధితుడు శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. పాండురంగాపురం గ్రామానికి చెందిన ఉల్వనూరు పీహెచ్‌సీ పాండురంగాపురం ఉపకేంద్రంలో ఆశావర్కర్ రమాదేవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఫ్యామిలీ ధృవీకరణ పత్రం కోసం నెలరోజుల క్రితం మీసేవలో దరఖాస్తు చేసుకుని, కార్యాలయం చుట్టూ తిరిగినా ఇవ్వడం లేదని వాపోయాడు. ఈ విషయమై తహసీల్దార్ వివేక్‌ను వివరణ కోరగా.. నాదృష్టికి రాలేదని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

బస్ పాస్‌లు పంపిణీ

పాల్వంచ: పాల్వంచ బస్టాండ్‌లో దివ్యాంగులకు శుక్రవారం ఆర్టీసీ కొత్తగూడెం డిపో మేనేజర్ ఎం.దేవేందర్ గౌడ్ చేతుల మీదుగా 25 మందికి పాస్‌లను పంపిణీ చేశారు. మేనేజర్ మాట్లాడుతూ.. దివ్యాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నాటుసారా స్వాధీనం

పాల్వంచరూరల్: కిన్నెరసాని పంచాయతీ రాజాపురంలో ఓ వ్యక్తి నాటుసారా విక్రయిస్తుండగా శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ మార్గంలో వెళ్తున్న పోలీసులను చూసిన ఆ వ్యక్తి సీసా వదిలేసి పారిపోయాడు. సీసా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రీడా స్ఫూర్తిని చాటాలి


పాల్వంచ: బహుమతులు అందిస్తున్న దృశ్యం

పాల్వంచ: క్రీడాకారులు గెలుపోటములు సమానంగా తీసుకుని క్రీడా స్ఫూర్తిని చాటాలని, జాతీయ స్థాయికి ఎదిగి జిల్లాకు వన్నె తేవాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీనివాస కాలనీ, మినీ స్టేడియంలో సీఎం కప్ 2024 అథ్లెటిక్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

ఇల్లెందురూరల్: కొత్తగూడెంలో శుక్రవారం జరిగిన సీఎం కప్ పోటీల్లో ఇల్లెందు మండల క్రీడాకారులు సత్తాచాటారు. ఖోఖోలో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం, పలు క్రీడాంశాలలో పలువురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరంతా వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని క్రీడా శిక్షకులు తెలిపారు.

ఉద్యోగులను రెగ్యులర్ చేయండి..



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

టేకులపల్లి: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేసి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సెలవులు, ఇతర సదుపాయాలు అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాపితంగా 12 రోజులుగా సమ్మె చేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, లక్కినేని సురేందర్ రావు డిమాండ్ చేశారు. శుక్రవారం టేకులపల్లి బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి సమ్మె శిబిరానికి వెళ్లి మద్దతు ప్రకటించి సంఘీభావం తెలిపారు. మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పర్మనెంట్ చేస్తామని ఇచ్చిన హామీని రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలన్నారు. ఉద్యోగులు సమ్మెలో ఉండటం వల్ల కేజీబీవీల్లో, దివ్యాంగుల పాఠశాలల్లో విద్యాబోధన కుంటుపడుతోందని, ఇతర విభాగాల కార్యాలయాల్లో కార్యకలాపాలు జరగడం లేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు అంగీకరించి సమ్మెను విరమింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరప్రసాద్ గౌడ్, పూల్ సింగ్, అజ్మీర రవి, బానోత్ బాలు, బాలు, ఎం.భద్రం తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి టీఎస్‌యూటీఎఫ్ మహాసభలు

టేకులపల్లి: టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర 6వ విద్యా, వైజ్ఞానిక మహాసభలు ఈనెల 28, 29, 30 తేదీలలో లక్ష్మీ గార్డెన్స్, నల్గొండలో జరుగుతాయని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కిషోర్‌సింగ్, జిల్లా ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని పలు పాఠశాలల్లో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. 28న ఉపాధ్యాయుల మహాప్రదర్శన ఉంటుందని, రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అధ్యక్షతన జరిగే ప్రారంభ సభలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డిలు ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరికుమార్, మాన్‌సింగ్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు జీపీఎఫ్ వర్తింపజేయాలి


ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగులకు ఈపీఎఫ్ బదులుగా జీపీఎఫ్ వర్తింపజేయాలని టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల రమేష్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల సుధాకర్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందించారు.

మాట్లాడుతూ.. ఆర్టిజన్ల గ్రేడ్‌లను కన్వర్షన్ చేయాలని, సీనియర్ ఫోర్‌మెన్ పోస్టులు మంజూరు చేయాలని, ఉద్యోగులపై పనిభారం పడుతున్నందున అదనపు పోస్టులు మంజూరు చేయాలని, ఉద్యోగ, ఆర్టిజన్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి పి.కరెంట్‌రావు, అధ్యక్షులు ఎండీ.యూసఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాసూరి శ్రీనివాస్, ట్రాన్స్‌కో కంపెనీ కార్యదర్శి పి.రాములు, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

23న విశ్వహిందూ మహాసంఘ్ సమావేశం


మాట్లాడుతున్న మద్దిశెట్టి సామేలు

జూలూరుపాడు: ఈనెల 23న జూలూరుపాడు యల్లంకి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో విశ్వహిందూ మహాసంఘ్ ఆధ్వర్యంలో జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని విశ్వహిందూ మహాసంఘ్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దిశెట్టి సామేలు పిలుపునిచ్చారు. శుక్రవారం జూలూరుపాడు యల్లంకి గార్డెన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అణగారిన వర్గాల ప్రజలు, వెనకబడిన తరగతులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల సమస్యల సాధన కోసం నిరంతరాయంగా పోరాటం సాగుతుందని, కార్మికుల కోసం ప్రత్యేక చట్టాలు తేవాలన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా బీజేఎంపీ జాతీయ అధ్యక్షుడు అర్నాబ్ చటర్జీ, జాతీయ చైర్మన్ బిస్వప్రియా రాయ్ చౌదరి, బీజేపీ జాతీయ నాయకులు రామ్ కుమార్ వాలియా, అఖిలభారత దళిత యాక్షన్ కమిటీ జాతీయ ఉపాధ్యక్షుడు మహవీర్ కొరివి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ప్రశాంత్ కుమార్, నేషనల్ జనరల్ సెక్రటరీ యశ్‌పవర్ హాజరు కానున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి పెద్ద ఎత్తున అన్నివర్గాల ప్రజలు, కార్మికులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలగాని శ్రీనివాస్‌గౌడ్, బానోత్ సుదర్శన్, భూక్యా రవి, కుంజా నాగేంద్ర బాబు, కొడెం సీతాకుమారి, కుదురుపాక నిర్మల, గుర్రం నాగమణి, సోము, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ప్రశ్నించినందుకే కేసులు


మాట్లాడుతున్న దిండిగల రాజేందర్

ఇల్లెందు: బీఆర్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేటీఆర్ మీద అక్రమంగా కేసు నమోదు చేయటం హేయమైన చర్య అని బీఆర్‌ఎస్ నేత దిండిగల రాజేందర్ అన్నారు. శుక్రవారం ఇల్లెందులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు అమలు చేయలేక రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను కప్పి పుచ్చుకునేందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రశ్నించి కేటీఆర్‌ను ఎదుర్కొలేక అక్రమంగా కేసులు పెట్టి అణిచివేయాలని చూస్తే భయపడే ప్రసక్తే లేదన్నారు. ఈ సమావేశంలో ఎస్.సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్లు, ఎండీ జాఫర్ హుస్సేన్, బావుసింగ్‌నాయక్, అబ్దుల్ నబీ, ఎండీ జబ్బార్, గిన్నారపు రాజేష్, చాంద్‌పాషా, కాసాని హరిప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనలు


జూలూరుపాడు: నిరసన తెలుపుతున్న కాంగ్రెస్, ప్రజాపంథా నాయకులు

పాల్వంచ: పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను అవమానకరంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని జిల్లా మాలమహానాడు సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ... అమిత్‌షాపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేయాలని, వర్గీకరణతో విడదీసి పాలిస్తున్న రాజకీయ నాయకులకు బలికావొద్దన్నారు. కార్యక్రమంలో కాల్వ భాస్కర్, కాల్వ ప్రకాష్‌రావు, వాసుమల్ల సుందర్‌రావు, బరగడి దేవదానం, చిరంజీవి, కాల్వ రామారావు, నవీన్, గండూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జూలూరుపాడులో నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. దేశంలో ప్రతీ పౌరుడు స్వేచ్ఛగా బతుకుతున్నారంటే అది అంబేద్కర్ పెట్టిన భిక్షే అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు వేల్పుల నరసింహారావు, కాంగ్రెస్ నాయకులు నర్వనేని పుల్లారావు, కొలిపాక వెంకటేశ్వర్లు, రాంశెట్టి నాగేశ్వరరావు, ఇల్లంగి సుందర్, దాసరి నాగయ్య, బోడా నాగరాజు, ఇదుపుల రాజు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ జిల్లా నాయకులు వై.గోపాల్ రావు, ఆటో యూనియన్ నాయకులు బాపట్ల పూర్ణచందర్‌రావు, కత్తి గోపి, తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు ఆధ్వర్యంలో..

మాలమహానాడు మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జూలూరుపాడులో డాక్టర్ అంబేద్కర్‌పై కేంద్రమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసన తెలిపారు. బుడిపూడి ప్రభాకర్, పోతురాజు రామారావు, బుడిపూడి ప్రతాప్, గత్తం బాబురావు, కాశిమళ్ల కమలాకర్, కళ్లోజి నరేష్, ధమయంతి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.